

నేడు 'నీట్' పరీక్ష



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆదివారం జరగనున్న నీట్ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. జిల్లాలోని నీట్ ఎగ్జామ్స్ కేంద్రాలు తిరుపతిలో తొమ్మిది, గూడూరులో ఒక సెంటర్ మొత్తం పది ఉన్నాయి. 4,489 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2-5 గంటల వరకూ ఆఫ్‌లైన్‌లో పరీక్ష ఉంటుంది. పరీక్షా కేంద్రాల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఏపీపీఎస్సీ గ్రూప్ 1 పరీక్ష తనిఖీ

రాత పరీక్షకు 68.39 శాతం హాజరు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

శనివారం ఉదయం ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, తాగునీరు, మౌలిక సదుపాయాలు ఏర్పాట్లను పరిశీలించారు. వేసవి ఎండల దష్ట్యా పరీక్షలు రాసే విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా తక్షణం వైద్య సేవలు అందించేందుకు ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల నిర్వహణ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. జిల్లాలో నేటి నుండి ప్రారంభమైన ఏపీపీఎస్సీ గ్రూప్-1, మెయిన్స్ రాత పరీక్షలకు మొత్తం 911 మంది అభ్యర్థులకు గాను 623(68.39) మంది అభ్యర్థులు హాజరయ్యారని, 288 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

'ఉపాధి' శ్రామికులకు 'వడదెబ్బ'





మద్దులమ్మ (64) మే 1న మృతి



కేశవులు (65) మే 4న మృతి

వరదయ్యపాలెం మండలంలోని చిలమత్తూరు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తూ కేశవులు (65) శనివారం మృతి చెందాడు. అదే మండలంలోని కంచరపాలెం గ్రామానికి చెందిన మద్దులమ్మ(64) ఉపాధి హామీ పనులు చేస్తూ ఈనెల 1వ తేదీన వడదెబ్బ తగిలి మృతి చెందింది. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో వడదెబ్బ తగిలి ఉపాధి కూలీలు (పవన్‌కల్యాణ్ భాషలో శ్రామికులు) అనారోగ్యం పాలవుతున్నారు. ముఖ్యంగా మే నెలలో మండుటెండలో కూలీల వ్యథ పగవానికి కూడా వద్దనేలా ఉండటం గమనార్హం. మండు వేసవిలో ఉపాధి కూలీలకు కల్పించాల్సిన మౌలిక వసతులను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఏడేళ్లుగా మరచిపోయింది. అంతేకాదు 'సమ్మర్ అలవెన్స్' (30 శాతం అలవెన్స్) అనే మాటే వినబడకుండా పోయింది. దీంతో మండే ఎండల్లో కాలే కడుపులతో కూలీలు ఉపాధి పనులు చేయాల్సి వస్తోంది. పార, గడ్డపార, తట్టలు ఇచ్చి దశాబ్దం గడిచిపోయిది. అమరావతి శంకుస్థాపనకు రెండోసారి విచ్చేసిన ప్రధాని మోదీకి 'ఉపాధి' శ్రామికుల' దుస్థితి వివరించి ఏడేళ్లుగా అమలుకాని సమ్మర్ అలవెన్స్ గురించి చర్చించి ఉంటే బాగుండేదని, కూలీలను శ్రామికులుగా పిలవడం బాగుందని, అయితే పిలుపు మాత్రమే కాదని, తమకు 'సమ్మర్ అలవెన్స్' కావాలని 'ప్రజాశక్తి'తో వాపోయారు.

> వారంలోనే ఇద్దరు మృతి
> ఉపాధి పనుల్లో కానరాని నీడ, నీరు
> ఏడేళ్లుగా నో 'సమ్మర్ అలవెన్స్'
> మూడు నెలలకోసారి వేతనాలు
> బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం కోత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 2.80 లక్షలకు పైగా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయి. వీరిలో 50 శాతం కుటుంబాలు మాత్రమే ఉపాధి పనులకు పోతున్నాయి. శ్రీకాళహస్తి డ్వామా క్లస్టర్ పరిధిలో 61 వేలకు పైగా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉన్నాయి. వీటిలో 50 వేలకు పైగా కార్డులు యాక్టీవ్ లో ఉండగా, వీరిలో 40 వేలకు పైగా కుటుంబాలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నాయి. అయితే పని ప్రదేశంలో కనీస మౌళిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. నీడ, నీరు, ప్రథమ చికిత్సా పెట్టెలు అందుబాటులో ఉంచడం లేదు. గడ్డ పారలు, పారలు, టార్పాలీన్ పట్టలు ఎక్కడా కానరాని పరిస్థితి. వాటిని కూలీలకు సరఫరా చేసి ఇప్పటికి పదేళ్లు దాటింది. ఫలితంగా ఉపాధి కూలీలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉపాధి పనులు చేయాల్సిన పరిస్థితి దాపరించింది. ప్రస్తుతం మేలోకి ప్రవేశించడంతో ఎండలు మిర్చిలా మండుతున్నాయి. కూలీలకు వడదెబ్బ తగలకుండా మజ్జిగ, మంచినీరు, నిమ్మరసం అందుబాటులో ఉంచాల్సి ఉంది. అయితే పని ప్రదేశాల్లో ఎక్కడా పంపిణీ కార్యక్రమం జరగడం లేదు. దీంతో వడదెబ్బ తగిలి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని కూలీలు వాపోతున్నారు. గతంలోనూ ఉపాధి పనులు చేస్తూ వడదెబ్బ తగిలి ప్రాణాలను కోల్పోయిన ఘటనలు చాలానే ఉన్నాయి.

రెండు పూట్ల మస్టర్ పై కూలీల అనాసక్తి!

ఉపాధి హామీ పథకాన్ని సమగ్రంగా అమలు చేసేందుకు కేంద్రం ఆ పథకంలో తీసుకొస్తున్న మార్పులు అసలుకే ఎసరు తెస్తున్నాయి. సాధారణంగా ఉపాధి హామీ పనుల్లో నీటి పసరులు, భూసార, పర్యావరణ పరిరక్షణ, కరవు నివారణ, వరద నియంత్రణ, అడవులు, చెట్ల పెంపకంతో పాటు ఇతర గ్రామీణాభివద్ధి పనులను పెద్ద ఎత్తున చేస్తుంటారు. ఇవన్నీ అత్యంత కష్టంతో కూడుకున్న పనులు, ఈ పరిస్థితుల్లో ఉపాధి కూలీలు రెండు పూట్ల పని చేస్తేనే హాజరు వేయాలని కేంద్రం చెప్తోంది. 2023 నుంచి దశల వారీగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుండగా కూలీలు మొండికేస్తున్నారు. ఉదయం 10 గంటలకే ఎండలు సుర్రుమంటూ చేతులు, కాళ్ళు బొబ్బలెక్కుతున్నాయనీ, మళ్ళీ మధ్యాహ్నం కూడా పని చేయమంటే ప్రాణాలపైకి తెచ్చుకోవడమేనని కూలీలు వాపోతుండటం గమనార్హం.

మూడు నెలలకోసారి వేతనాలు

ఉపాధి పథకానికి బడ్జెట్ కేటాయించడంలో కూలీలకు బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం నెలకొంటోందన్న విమర్శలు వస్తున్నాయి. మూడు నెలలకోసారి బిల్లులు చెల్లిస్తున్నారని కూలీలు వాపోతున్నారు. గతంలో టీసీఎల్ ద్వారా రాష్ట్రం బిల్లులు చెల్లిస్తుండగా, ఇప్పుడు కేంద్రం జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) కింద రోజువారీగా కూలీల వివరాలను నమోదు చేస్తూ ఎన్ఐసీ ద్వారా చెల్లింపులు చేస్తోంది. ఫలితంగా బిల్లులో జాప్యం జరుగుతోందంటూ ఉపాధి హామీ అధికారులే చెబుతుండడం గమనార్హం. కేంద్రం గత బడ్జెట్తో పోలిస్తే నిధులు పెంచాల్సింది పోయి దాదాపు 13వేల కోట్లు తగ్గించడం కూలీల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. క్యూబిక్ మీటర్ పనికి గతంలో రూ.320 వరకు చెల్లిస్తుండగా సవరించిన కొలతల్లో అది రూ.250కి చేరింది. ఫలితంగా కూలీలకు ఉపాధి గిట్టుబాటు కాని పరిస్థితి. సవరించిన జీవో ప్రకారం ఒక మనిషి ఆరు గంటలు పనిచేస్తే రోజుకు రూ.630 చెల్లించాలని చట్టం చెబుతోంది. అయితే ఉపాధి కూలీలకు రోజుకు రూ.250 లే గిట్టుబాటు అవుతోంది. రోజుకు రూ. 300 గిట్టుబాటవుతోందని అధికారులు చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయంటూ కూలీలు వాపోతున్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి నిరుపేదలకు మూడు పూటలా తిండి, చేతినిండా పని కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారులు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రజలను, సరుకులను ఇతరత్రా వాటిని చేరవేసేందుకు ఉపయోగపడేవి రహదారులు. కానీ జిల్లాలో ఈ రహదారులు ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. అధికారుల బాధ్యతారాహిత్యమో, నిర్లక్ష్యం కారణంగానో పలు కుటుంబాలు ఆసరాను, పెద్ద దిక్కును కోల్పోయి రోడ్డున పడాల్సిన పరిస్థితులు దాపురించడం బాధాకరం. జిల్లాలోని జాతీయ రహదారుల్లో ఐదు రోజుల్లో ఆరు ప్రమాదాలు జరగ్గా తొమ్మిది మంది మృతి చెందారు. 12 మంది గాయపడ్డారు. జాతీయ భద్రతా దినోత్సవాలు జరిగిన ప్రతిసారీ 'బ్లాక్ స్పాట్స్‌ను'గుర్తించామని అధికారులు చెబుతూనే ఉంటారు. అయితే యాక్సిటెండ్లు మాత్రం ఆగకపోవడం గమనార్హం.

తిరుపతి జిల్లాలో ఐదు జాతీయ రహదారులు ఉన్నాయి. కడప- చెన్నయ్ వయా రేణిగుంట మీదగా ఒకటి, నాయుడుపేట-బెంగుళూరు వయా తిరుపతి మీదుగా, నెల్లూరు -చెన్నయ్ వయా సూళ్లూరుపేట, తిరుపతి-అనంతపురం వయా పీలేరు మీదుగా, కడప-చిత్తూరు వయా దామలచెరువు మీదుగా ఐదు జాతీయ రహదారులు ఉన్నాయి. జాతీయ రహదారులు నాలుగులేన్లు, ఆరు లేన్లు రోడ్లతో విశాలంగా ఉంటాయి. విశాలమైన రహదారుల వల్ల సుదూర ప్రాంతాలకు వేగంగా తక్కువ సమయంలో చేరుకోవచ్చు. ఈ పోటీ ప్రపంచంలో తక్కువ సమయంలో ఎక్కువ చేయాలనే అలోచనతో చాలా మంది సురక్షతను, భద్రతను మరిచిపోతూ వేగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో దురదృష్టవశాత్తు ప్రమాదాల బారిన పడుతూ మృత్యువు ఒడిలోకి జారుకుంటున్నారు. కొంత మంది పూర్తిస్థాయి అంగవైకల్యంతో మంచానికి పరిమితం అయ్యే పరిస్థితిని తెచ్చుకుంటున్నారు. జిల్లాలో జాతీయ రహదారుల్లో గడిచిన ఐదు రోజుల్లో ఆరు ప్రమాదాలు చోటుచేసుకోగా ఈ ప్రమాదాల్లో 9 మంది మృతి చెందారు, మరో 12 మందికి తీవ్రగాయాలయ్యాయి, అందులోనూ ముగ్గురు పరిస్తితి ఆందోళనకరంగా ఉండడం బాదాకరం. తమిళనాడు హోసూరుకు చెందిన ఓ కుటుంబానికి చెందిన ఏడు మంది సొంత కారులో తిరుమల శ్రీవారి దర్శన్నానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఏప్రిల్ 28వ తేదిన పాకాల మండలం తోటపల్లి వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్‌ను వేగంగా ఢీకొట్టడంతో ఐదు మంది మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అదే రోజు కోట మండలంలో వెంకన్నపాలెం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకునడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి, ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శీనయ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందారు. ఈ నెల 30వ తేది చంద్రగిరిలోని నాగాలమ్మ ఆలయం సమీపంలో హెచ్‌పి పెట్రోల్ బంకు ఎదురుగా బంధువులను బెంగుళూరుకు బస్సు ఎక్కించి తిరిగి ద్విచక్రవాహనంపై ఇంటికి వెల్లేందుకు సిద్ధమవుతున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీరు సంతోష్‌కుమార్‌రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రగాయాలపాలయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న అతను పరిస్తితి విషమించడంతో శుక్రవారం మృతి చెందారు. అదే రోజు తిరుమల ఘాట్ రోడ్డులో కారు అదుపుతప్పి పిట్టగోడను ఢీకొనడంతో నలుగురు భక్తులకు గాయాలయ్యాయి. తిరుమల ఘాట్‌రోడ్డులో అదే రోజు మరో రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. 30వ తేది దామినేడు సమీపంలో ద్విచక్ర వాహన ప్రమాదంలో మరో ఇద్దరు గాయాలు పాలయ్యారు. మే ఒకటోతేది ఆర్‌సి రోడ్డులోని ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మే రెండోవ తేది బెంగుళూరు లగేరీకి చెంది ఐదు మంది కుటుంబ సభ్యులు సొంత కారులో తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తూ ప్రమాదవశాత్తు పనపాకం సమీపంలోని హెరిటేజ్ వద్ద కారు రోడ్డుపై పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో కర్రగౌడ్, నూతన్ అక్కడికక్కడే మృతి చెందారు. శాంతమ్మ, మంజునాథ్, సౌమ్యకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారుల్లో ఎక్కువగా తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తూ, దర్శనాంతరం తిరిగి వెళ్లూతూ ప్రమాద బారిన పడుతున్నారు. స్వామి దర్శనానికి సమయం అయిపోతుందని, దర్శనాంతరం త్వరగా ఇంటికి చేరుకోవాలని, గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి, నిద్ర ఆహారాలు సక్రమంగా లేక అలసటతో వాహనాలు నడపడం, నిద్రమత్తు ఇతరత్రా కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పోలీసులు పేర్కొన్నారు. వాస్తవానికి జాతీయ రహదారుల్లో నిత్యం తనిఖీలు చేయాల్సిన పెట్రోలింగ్ విధులు సక్రమంగా జరగడం లేదు. ఏవైనా వాహనాలు జాతీయరహదారిపై మరమత్తులు కారణంగా ఆగిపోతే వాటిని త్వరగా అక్కడ నుంచి తరలించి, ఇతర వాహనాలకు ఇబ్బంది లేకుండా చేయాల్సిన బాధ్యత పెట్రోలింగ్ సిబ్బందిదే. కానీ ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. ప్రమాదమలుపులు వద్ద, క్రాసింగ్‌ల వద్ద సూచికబోర్డులు పూర్తి స్థాయిలో లేవు. జిల్లాలోనే 7 టోల్‌ప్లాజాలు ఉన్నాయి. టోల్‌ఫీజు వసూళ్లపై ఉన్న శ్రద్ధ అధికారులకు, ప్రభుత్వాలకు ప్రయాణికుల భద్రతపై లేదని, ప్రయాణీకులు విమర్శిస్తున్నారు. జాతీయ రహదారులపై భద్రత చర్యలు చేపట్టి, ప్రయాణీకుల ప్రాణాలు కాపాడలని పలువురు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ భాగ్యశ్రీపై దౌర్జన్యం

ఎముకలు విరిచిన టిడిపి నాయకుడు

మంగళంలో ఆలస్యంగా వెలుగులోకి..



బాధితురాలు భాగ్యశ్రీ నుండి వివరాలు తెలుసుకుంటున్న ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం మంగళం సప్తగిరి కాలనీలోని అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న భాగ్యశ్రీది. మంగళంలోని రాముల వారి ఆలయంలో పారిశుద్ధ్య పనులు చేసుకుని ఆటో తోలుకుంటూ జీవనం సాగిస్తోంది. గడిచిన 20 ఏళ్లుగా స్థానికంగా ధనకుమార్ అనే వ్యక్తితో సహజీవనం. ఏమి జరిగిందో ఏమో కానీ గత నెల 27న రాత్రి 10:30 గంటలకు భాగ్యశ్రీని, ఆమె చెల్లెలు భర్త ప్రతాప్, కుమారుడు హేమంత్‌లను మంగళం పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు ఎల్. సురేష్ కుమార్ (ధనకుమార్ తమ్ముడు), రమాదేవి, మంజుల, ప్రసన్న, పవన్ అని వ్యక్తులు నమ్మించి రప్పించి ఇష్టానుసారంగా కొట్టడంతో భాగ్యశ్రీ ఎడమ కాలు నడుము వద్ద విరిగిపోయింది. దీంతో భాగ్యశ్రీని వైద్య చికిత్స నిమిత్తం రూయా ఆసుపత్రికి తరలించడంతో అక్కడి వైద్యులు ఘటనపై ఎమ్మెల్సీ నమోదు చేయించుకుని, ఆమెకు సర్జరీ చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయంతి, సాయిలక్ష్మి ఆమెను ఆస్పత్రిలో పరామర్శించారు. బాధితురాలి వివరాలిలా ఉన్నాయి.

తన బతుకు తానే బతుకుకుంటూ డబ్బులు అవసరమైనప్పుడు ధనకుమార్ కుటుంబ సభ్యులకు సాయం చేశానని, తనతో మాట్లాడాలని ధనకుమార్ కుమారుడు పవన్ సాయంత్రం ఆరున్నర గంటల నుండి పదేపదే ఫోన్ చేశారని తెలిపారు. రాత్రి అయింది పొద్దున మాట్లాడుకుందాం అని చెప్పినా వినిపించుకోకుండా ఫోను చేస్తుంటే ఇంటి వద్దకు తన కొడుకును తీసుకుని వెళ్లామన్నారు. అప్పటికే ధనకుమార్‌ను కొట్టి ఇంటిలో ఉంచారన్నారు. తాము అక్కడికి వెళ్ళగానే ఒకసారిగా తమపై ఇష్టం వచ్చినట్లు దాడి చేశారన్నారు. వారు కొట్టే దెబ్బలకు తాళలేక స్పృహ తప్పి పడిపోయానన్నారు. మహిళ అని చూడకుండా ఎక్కడబడితే అక్కడ ఇష్టానుసారంగా తీవ్రంగా కొట్టారని కన్నీరు మున్నీరుగా తన బాధను మీడియాకు వివరించారు. తనను, తన కొడుకును చంపేస్తానని బెదిరిస్తున్నారని, తాము అధికారంలో ఉన్నందున తమను ఎవరూ ఏమి చేయలేరని చెబుతున్నారని వాపోయింది.

దాడిని తీవ్రంగా ఖండించిన ఐద్వా.....

ఒక మహిళ ఆమెతో సమస్య ఏదైనా ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చని ఇవేమీ కాకుండా అధికారం ఉంది కదా అని టిడిపి నాయకులు ఒక మహిళను, అది ఆటో తోలుకుంటూ తన కాళ్ళపై తాను జీవిస్తున్న ఆమెను ఇక ఆ జీవనోపాధి కూడా చేసుకోలేకుండా వికలాంగురాలిని చేశారని, దీనిపైన పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భాగ్యశ్రీపై దాడి చేసిన వారిపై కఠిన శిక్షలు నమోదు చేసి న్యాయం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి, జిల్లా అధ్యక్షురాలు జయంతి డిమాండ్ చేశారు.

తిరుచానూరు 'పార్కింగ్' గుత్తేదారు దందా



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి సన్నిధిలో పార్కింగ్ పేరుతో టెండర్ దారు నిబంధనలు మీరి భక్తుల నుండి వాహనాల పార్కింగ్ కు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల తిరుచానూరు గ్రామపంచాయతీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి తిరుచానూరులోని ప్రైవేట్ బస్టాండ్, బస్టాండ్ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు బహిరంగ వేలంలో 3 కోట్ల 51 లక్షలకు కూటమి నాయకుడు వెంకటేష్ రాయల్ దక్కించుకున్నారు. టెండర్ దక్కించుకున్న గుత్తేదారు తిరుచానూరు సందర్శనార్థం వచ్చే భక్తుల వాహనాల నుండి వసూలు చేయాల్సిన నగదు పట్టికను కాదని, సొంతంగా బిల్లు పుస్తకాలను తయారు చేయించుకుని తిరుచానూరుకు వచ్చే భక్తుల నుండి అధికంగా వసూలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. వసూలు చేయాల్సిన నగదుకు ఇచ్చే రసీదులలో, పంచాయతీ నుండి వసూలు చేయాల్సిన ధరల పట్టికకు వ్యత్యాసం కనిపిస్తోంది. పంచాయతీ ఇచ్చిన రుసుముల వసూలు ప్రకారం తిరుపతి-తిరుచానూరు మధ్య నడిచే ప్రైవేట్ బస్సు పార్కింగ్‌కు రోజుకు వంద రూపాయలు, టూరిస్ట్ బస్సులకు, మెటాడోర్ వ్యానుకు వంద రూపాయలు, శ్రీనివాస మ్యాక్సీ క్యాబ్ వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ లైసెన్స్ పొందిన వారి వద్దనుంచి మెటాడోర్‌కు రూ.70, క్వాలిస్, సుమో, ట్రాక్స్, కారు మొదలైన వాటికి రూ.60, జీపు, ట్రాక్టర్ వాహనాలకు రోజుకు రూ.50, ఆటోలకు రోజుకు రూ.5గా నిర్ణయించారు.

సగటున 20వేల మంది......

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటున 20వేల మంది భక్తులు తగ్గకుండా దర్శనానికి వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చేవారు వారి వాహనాల పార్కింగ్ చేసుకోవడానికి తప్పనిసరిగా గ్రామపంచాయతీ విధించిన రుసుమును చెల్లించాల్సిందే. అయితే పంచాయతీ నుండి టెండర్ దక్కించుకున్న గుత్తేదారు నిబంధనలను అతిక్రమించి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు భక్తుల నుండి వినిపిస్తున్నాయి. గ్రామపంచాయతీ సూచించిన రుసుముల వసూళ్ల పట్టికకు అదనంగా ప్రతి వాహనానికీ 10-20 రూపాయల చొప్పున వసూలు చేస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. సగటున 20వేల మంది రోజుకు దర్శనం చేసుకుంటే, పర్వదినాల్లో 50 నుంచి 60 వేల మంది అమ్మవారి దర్శనానికి వస్తుంటారని సమాచారం. ఈ నేపథ్యంలో రోజుకు గ్రామపంచాయతీ నుండి పార్కింగ్ టెండర్ దక్కించుకున్న గుత్తేదారుకు లక్షన్నర పైనేతగ్గకుండా పార్కింగ్ రుసుము వసూళ్లు అవుతున్నట్టుగా తెలుస్తోంది. సొంతంగా ముద్రించిన పార్కింగ్ రుసుము రశీదులతో మరింతగా ఆర్జించుతున్నారని తెలుస్తోంది. నెలకు సరాసరి 40 లక్షలు అనుకుంటే, ఏడాదికి సరాసరి పండగ పర్వదినాలన్నీ కలుపుకుని ఐదు కోట్లపైనే లబ్ది పొందుతాడన్నది అంచనా.

'సొంత రశీదు'లతో భక్తుల నుంచి అధిక వసూళ్లు

నోటీసులు జారీ చేస్తాం.

శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ విషయంలో నిబంధనలు మీరి వసూలు చేస్తున్నట్లు మా దష్టికి వచ్చింది. కొంతమంది అసోసియేషన్‌గా ఏర్పడి జిల్లా కలెక్టర్ వద్ద నుండి కొన్ని వాహనాలకు నగదు వసూళ్లకు సంబంధించి లేఖను తీసుకున్నారు. అది కాకుండా చిన్నపాటి వాహనాలకు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్టుగా రశీదులు అందాయి. దీనిపై సదరు గుత్తేదారుకు నోటీసులు జారీ చేస్తున్నాం. **- మాధురి, తిరుచానూరు గ్రామపంచాయతీ ఇన్చార్జి కార్యదర్శి,**

ఇక్కడ చాలా డిఫ'రెంట్'...!

ఆర్టీసీ బస్టాండ్‌లో... షాపింగ్ కాంప్లెక్స్..!

మండుటెండలో రోడ్డుపైనే ప్రయాణికులు

29 పంచాయతీల పరిధిలోని జనం 'వ్యథ'

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

'ఆర్టీసీ బస్టాండ్ అనేది ప్రయాణికులకు వసతి కల్పించేలా, నీడ అందించేలా ఏర్పాటు చేసుకున్నది.. అయితే చాలాచోట్ల నిరుపయోగంగా ఉన్నాయన్నది నిర్వివాదాంశం.. బర్రెలను కట్టేసుకునే బస్టాండ్‌లూ ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.. అంతేకాదు చాలా చోట్ల యాచకులకు నిలయంగా మారిపోయాయి.. అయితే వరదయ్యపాలెం బస్టాండ్ పూర్తిగా డిఫ'రెంట్'.. షాపింగ్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేసేసి వేలం వేసి బాడుగకు ఇచ్చేశారు.. దీంతో ప్రయాణికులు మండుటెండలో రోడ్డుపై మాడిపోవాల్సిందే. మండల కేంద్రం కావడంతో బస్సుల రాకపోకలు దాదాపు అర్ధగంటపైనే వేచి ఉండాల్సి ఉంటుంది. నిల్చునే తోవ లేక, నీడలేక 29 పంచాయతీల పరిధిలోని ప్రయాణికుల 'వ్యథ'పై 'ప్రజాశక్తి' ఫోకస్.

వరదయ్యపాలెం మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండ్, వ్యాపారులకు అనువుగా తయారయ్యింది. బస్సు ఎక్కాలంటే ఏ చెట్టు కిందనో, వానలోనో తడుస్తూనే బస్సు ఎక్కే పరిస్థితి. ప్రయాణికులు ఇన్ని అవస్థలు పడుతున్నా, వారి బాధను అర్థం చేసుకున్న నాధుడే మండలంలో కరువయ్యాడు. సత్యవేడు నియోజకవర్గంలోనే ముఖ్యమైన మండలం వరదయ్యపాలెం. దాదాపు 29 పంచాయితీలతో అనేక గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానంగా ఈ ప్రాంతం ఉంది. ఇక్కడి నుండి శ్రీ సిటీ, అపాచీ తదితర పరిశ్రమలకు అనేకమంది కార్మికులు, కూలీలు ఈ ప్రాంతంనుంచే ప్రయాణిస్తూ ఉంటారు. ముఖ్యంగా పల్లె ప్రజలు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తూ వారి గమ్యాలను చేరుతూ ఉంటారు. అలాంటి ప్రయాణికులకు అణువుగా ఉండేందుకు బస్సు షెల్టర్ నిర్మించగా ఆర్టీసీ అధికారుల అత్యాశకు ప్రయాణికులు బలయ్యారు. బస్ షెల్టర్‌లో ప్రయాణికుల సౌకర్యం ఏర్పాటు చేయవలసిన కనీస వసతుల స్థానంలో వ్యాపారస్తుల కొరకు దుకాణ సముదాయం నిర్మించి అద్దెలు వసూలు చేసుకుంటున్నారు. కనీసం కొంత ప్రాంతమైన ప్రయాణికుల కోసం వదిలిపెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులను ప్రశ్నించగా ఎటువంటి సమాధానం చెప్పకపోగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అనేకమంది ప్రయాణికులు వాపోతున్నారు. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధి సైతం ఈ సమస్యపై దష్టి పెట్టకపోవడం గమనార్హం.

దాతల సహాయం బూడిదలో పోసిన పన్నీరే

'అమ్మ భగవాన్ సేవాసమితి' వారు బస్టాండ్ సముదాయం ప్రాంగణంలో సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేసి ఆ ప్రాంతమంతా అన్ని వసతులతో అభివద్ధి చేశారు. అదే సమయంలో తాగునీటి వసతి సైతం కల్పించి ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండే విధంగా తగు చర్యలను తీసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత వాటిని ఆర్టిసి వారు పట్టించుకోకపోవడంతో దాతల సహాయం బూడిదలో పోసిన పన్నీరు అయ్యింది. తాగునీరు కాస్త బురద నీరు కాగా, ఆ దిమ్మెలా సమీపంలో అనేక తోపుడుబండ్లు ఏర్పాటు అయ్యాయి. ప్రయాణికుల అవస్థలు ఎవరూ పట్టించుకోకపోగా ప్రభుత్వ ఆస్తులను ఇలా ప్రైవేట్ వ్యక్తులు దోచుకుంటున్నారని ప్రశ్నిస్తున్న వారిని సైతం కొంతమంది దుకాణదారులు బెదిరించడం కొసమెరుపు.

పోలీసులకు సహకరించని పంచాయతీ అధికారులు

స్థానిక ఎస్సై మల్లికార్జున్ రోడ్డుకు అడ్డంగా ఏర్పాటైన దుకాణాలను అక్కడి నుండి ఖాళీ చేయించే ప్రయత్నం చేసినా తాము పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నామని స్థానిక పంచాయతీ అధికారులే ఇక్కడ వ్యాపారం చేసుకోవడానికి అనుమతిస్తున్నారని చెప్పడం కొసమెరుపు. పంచాయతీ అధికారులను ఆర్ అండ్ బి అధికారులను స్థానిక ఎస్సై సమన్వయం చేసుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకారం అందించాలని కోరగా వారి నుండి స్పందన రాకపోవడంతో అనేకసార్లు ప్రయత్నించిన స్థానిక ఎస్సై మిన్న కుండిపోవడం తప్ప చేసేదేమీ లేకపోయింది.

అక్రమ వసూళ్ల పైనే శ్రద్ధంతా..?

ఆర్టీసీ ప్రాంగణం మొత్తం వ్యాపారుస్తులతో కిక్కిరిసిపోయి ఉంది. బస్టాండ్ ఆవరణంలో ముందు భాగం మొత్తం తోపుడుబండ్లతో నిండిపోయి ఉంది. ఆక్రమణ దారులను ఖాళీ చేయించకపోగా ప్రతిరోజూ పంచాయతీ వారు వాళ్ళ వద్ద నుండి కొంత నగదును అక్రమంగా వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో లేదన్న విమర్శలు లేకపోలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు బస్టాండ్ ఆవరణలో ఉన్న దుకాణదారులను ఖాళీ చేయించి ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇదేగనుక జరిగితే మండుటెండలో ప్రయాణికులకు ఎంతో ఉపశమనం.



బస్టాండ్‌ను షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చేసిన ఆర్టీసీ

ఘనంగా ఎస్సీవీ నాయుడి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడు 70వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది అభిమానుల మధ్య ఆయన కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వారంతా ఎస్సీవీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీవీ నాయుడు ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. పార్టీలకు అతీతంగా నాయకులు హాజరై ఎస్సీవీనాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పలువురు సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా అన్నదానం నిర్వహించారు. ఆయన ఆశయాలు నెరవేరాలని, రాబోయే రోజుల్లో ప్రజలకు సేవ చేసేలా పదవులు దక్కాలని వారు ఆకాంక్షించారు. నాయకులు గురు దశరథన్, నారాయణ యాదవ్, సత్యవాద ప్రవీణ్, ఎస్సీవీ దిలీప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘటోత్సవంతో శ్రీశ్రీ పోలేరమ్మ జాతర ప్రారంభం



ప్రజాశక్తి - నాయుడుపేట: ఆదివారం ఉదయం ఐదు నుంచి ఆరు గంటల మధ్య ఘటోత్సవంతో శ్రీశ్రీ పోలేరమ్మ జాతర ప్రారంభించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి హరికృష్ణ తెలియజేశారు. తిరుపతి జిల్లా నాయుడుపేట గ్రామ దేవత శ్రీశ్రీ పోలేరమ్మ జాతర ఈ రోజు నుండి ఏడో తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. గత 40 సంవత్సరాలుగా నాయుడుపేటలో భారీ స్థాయిలో శ్రీశ్రీ పోలేరమ్మ జాతర నిర్వహిస్తున్నామన్నారు. 4 రోజులు పాటు దేవాదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో, శ్రీశ్రీ పోలేరమ్మ జాతర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని, ఈ జాతరకు నాయుడుపేట చుట్టుపక్కల మండలాల నుంచి లక్షల మంది భక్తులు హాజరవుతారని తెలిపారు. జాతరకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఆదివారం ఘటోత్సవం, సోమవారం పుటోత్సవం, మంగళవారం అమ్మవారి పీఠ స్థాపన, మంగళవారం రాత్రి అమ్మవారి నగరోత్సవం, బుధవారం జాతర మహోత్సవం, సాయంత్రం 5 గంటల వరకు భక్తులకు దర్శనం అనంతరం రాత్రి నిమజ్జనంతో జాతర పూర్తవుతుందని తెలియజేశారు.

ఓసూరమ్మ కొలుపుకు లక్ష రూపాయల విరాళం



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట మండలం, భీమవరంలో వెలసిన శ్రీ ఓసూరమ్మ తల్లి కొలుపు నిర్వహించేందుకు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఒక లక్ష రూపాయలు విరాళం భీమవరం గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భీమవరం గ్రామ దేవత ఓసూరమ్మ తల్లి కొలుపు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ, సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనం బేటి విజయభాస్కర్ రెడ్డి, నాయకులు పి.సుబ్రహ్మణ్యం రెడ్డి, పసల గంగా ప్రసాద్, గోను బాబు, తుపాకుల కన్నెమ్మ పాల్గొన్నారు.

గోవిందయ్యకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి గోవిందయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు సీఈ రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్ర విభాగంలో ఆచార్య వైవి రామిరెడ్డి పర్యవేక్షణలో ఫిజికో కెమికల్ ప్రాపర్టీస్ ఆఫ్ బైనరీ ఆర్గానిక్ లిక్విడ్ మిక్సర్ త్రూ ఎఫ్ టి ఐ ఆర్ స్పెక్ట్రల్ అనాలసిస్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. గోవిందయ్య కడపలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్నారు.

ఏఎస్ఐగా షణ్ముగం బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి-నాగలాపురం: మండల కేంద్రం నాగలాపురం పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా షణ్ముగం శనివారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఆయన గతంలో వరదయ్యపాలెంలో పనిచేస్తూ సాదరణ బదిలీపై నాగలాపురం స్టేషన్కు వచ్చినట్లు తెలిపారు.

వేసవి సెలవల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించినప్పటికీ తిరుపతి జిల్లాలో మాత్రం ఇంటర్ బోర్డ్ నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తిరుపతి జిల్లా కార్యదర్శి భగత్ రవి, నగర కార్యదర్శి తేజ, శివలు ఆర్ఐఓను కలిసి వినతిపత్రం ఇచ్చారు. తిరుపతిలో చైతన్య, నారాయణ విద్యాసంస్థలతో పాటు, కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఎంసెట్ కోచింగ్ పేరుతో తరగతులు నిర్వహిస్తున్నాయన్నారు. ఆర్ఐఓ స్పందిస్తూ సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని ప్రముఖ సినీ గాయని ఉష దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆలయం వెలుపల ఉష మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారి భక్తి గీతాన్ని ఆలపించి అలరించారు. వాయిస్ ఆఫ్ ఉష అనే ఛానల్ ప్రారంభించినట్లు చెప్పారు. ఐకా రికార్డు లేబుల్ అనే రికార్డింగ్స్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కారు–షికారు అనే ఇంటర్వ్యూ కూడా ప్లాన్ చేస్తున్నానని అన్నారు. ఇక పొడకాస్ట్ ఛానల్ సైతం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న విజయసాయి రెడ్డి దంపతులు

తిరుమల శ్రీవారిని మాజీ ఎంపీ విజయ్ సాయి రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పోస్ట్ వైరల్ ఆర్థల్జియా ఒక వైరల్ ఇన్ఫెక్షన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి : పోస్ట్ వైరల్ ఆర్థల్జియా అనేది ఒక వైరల్ ఇన్ఫెక్షన్ అని, ఇది కీళ్లల్లో వాపు కాకుండా, కీళ్ల నొప్పి మాత్రమే ఉంటుందని, అలాగే వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కీళ్లల్లో దీర్ఘకాలిక నొప్పి, మృదువైన వాపు, తక్కువ స్పర్శ వంటి లక్షణాలు ఉంటాయని రుమటాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.శరత్ చెప్పారు. తప్పకుండా డాక్టర్ను సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలిపారు. స్విమ్స్లో కమ్యూనిటీ మెడిసిన్, మైక్రో బయాలజీ, రుమటాలజీ విభాగాల ఆధ్వర్యంలో సిఎంఇ విజయవంతమయ్యింది. శనివారం మధ్యాహ్నం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమాన్ని నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. మైక్రో బయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.రామక్రిష్ణ, డాక్టర్ రవిశంకర్ పాల్గొన్నారు.

▪ అధ్వాన స్థితిలో నాగలాపురం ఆర్టీసి బస్టాండు ▪ ప్రయాణీకులకు పనికిరాని వైనం ▪ చీకటిపడితే మందుబాబుల అడ్డా



ఇదండీ..! బస్టాండు

ప్రజాశక్తి - నాగలాపురం: మండల కేంద్రమైన నాగలాపురం ఆర్టీసి బస్టాండు అధ్వాన స్థితిలో ఉంది. బస్టాండు ఆవరణలో మల మూత్ర విసర్జన చేయడం, రాత్రివేళల్లో మద్యం సేవించడం వంటివి చేయడం వల్ల బస్టాండు ఆవరణమంతా దుర్వాసన వెదజల్లుతుంది. ప్రయాణీకులు ఎవరుకూడా బస్టాండులో నిలబడడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. బస్టాండు చుట్టూ ఆటోలు ఆపి ఉంచుతారు. ఇతర వాహనాలు పార్కింగ్కు బస్టాండు ఆవరణ ఉపయోగపడుతోంది కానీ, ప్రయాణీకులు ఉపయోగం లేదు. గతంలో కురిసిన భారీ వర్షాలతో నాగలాపురం ఆర్టీసి బస్టాండు గుంతల మయమైంది. స్థానిక సర్పచ్ చిన్నదొరై సుధా తన సొంత ఖర్చులతో జెసిబి పెటించి నేల చదును చేయించారు. బస్టాండు అటు ఎండకూ, ఇటు వానకు కూడా ప్రయాణీకులకు సేద తీర్చ వీలులేని పరిస్థితిలో ఉంది. ఇక మౌలిక వసతులు కూడా లేక మహిళల పరిస్థితి ఇంకా ఇబ్బందికరంగా ఉంది. ఒక్క టి.పి.కోట మార్గంలో సత్యవేడు వెళ్లే బస్సులు తప్ప మిగతా బస్సులు బస్టాండు లోపలకి రావడంలేదు. బస్టాండు లోపల ప్రయాణీకులకు కుర్చీలు గాని ఫాన్లు గాని లేక పోవడంతో ఈ వేసవిలో ఉక్కపోతతో అల్లాడి పోతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధుల పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. బస్సు ఎక్కాలంటే లెక్కలేనన్ని కష్టాలని వాపోతున్నారు. ముఖ్యంగా తిరుమల–చెన్నై ఎక్స్ప్రెస్ బస్సులు నాగలాపురం లోపలకి రావడంలేదు. పలు మార్లు తిరుమల డిపో మేనేజరుకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఇకనైనా డిపో అధికారులు శ్రద్ధ వహించి నాగలాపురం ఆర్టీసి బస్టాండుకు అన్ని బస్సులు వచ్చేలా చూడాలని, బస్టాండులో వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

▪ **చర్యలు తీసుకుంటాం**



బస్టాండులోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి, త్వరలో పరిష్కరించి అన్ని వసతులు ఏర్పాటుకు కృషి చేస్తాం. ట్రాఫిక్ సూపర్ వైజర్ను నియమించి ప్రయాణికులకు మెరుగైన సేవలకు చర్యలు తీసుకుంటాం.

వెంకటరమణ డిపో మేనేజర్, సత్యవేడు

▪ **వసతుల్లేక ఇబ్బంది**



బస్టాండ్ ఆవరణలో మహిళలకు కనీసం బాత్ రూమ్ వసతి కూడా లేక తీవ్ర ఇబ్బందిగా ఉంది. కనీసం తాగడానికి కూడా నీళ్లు లేవు. బస్టాండులోకి బస్సులు అన్నీ రావడం లేదు. రోడ్లపై నుండే వెళ్లిపోతున్నాయి. అధికారులు మహిళల ఇబ్బంది తెలుసుకుని సమస్యలు పరిష్కరించాలి.

బుజ్జమ్మ, ఎస్ఎస్ పురం అరుంధతి వాడ

▪ **పరిసరాలు అపరిశుభ్రం**



బస్టాండ్లో కనీసం కూర్చోవడానికి కూడా వీలు లేక బస్సు షెల్టర్ అధ్వాన స్థితిలో ఉంది. మరుగు కంపుతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. అధికారులు ఎండ తీవ్రతను గుర్తించి ప్రయాణికులు కూర్చోవడానికి తగు ఏర్పాట్లు చేసి, బస్టాండ్ను శుభ్రంగా ఉంచాలి.

- మహేష్, వెల్లూరు గ్రామం

చెవిరెడ్డి అసత్య ఆరోపణలు మానుకోవాలి

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మాజీ ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండల టిడిపి నాయకులు శనివారం మీడియాకు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేశారో తెలియజేస్తే బాగుంటుందన్నారు. ఉపాధి హామీ పథకంలో పనులు చేయకపోయినా ప్రజల సొమ్ము స్వాహా చేసి నచ్చిన వారి ఖాతాల్లో జమ చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: పులివర్తి నానిపై ఎదో ఒక అసత్య ఆరోపణ చేయడం మాజీ ఎమ్మెల్యేకు అలవాటుగా మారిందని, చెవిరెడ్డి అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని టీడీపీ నాయకులు హితవుపలికారు. గత పదినెలల్లోనే ఎంతో అవనీతి జరిగిపోయినట్లు చెప్తున్న మాజీ ఎమ్మెల్యే, 2019 నుంచి 2024 వరకు కూడా ఎంత అవనీతి జరిగిందో ప్రజలకు తెలియజేస్తే బాగుంటుందన్నారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు వైసీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని స్పష్టం చేశారు.

ప్రజాశక్తి - రామచంద్రపురం: శనివారం మండల టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ అధ్యక్షుడు ఎం.తిరుమలరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైసిపి పాలనలో నరేగాలో క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల నుండి నియోజకవర్గస్థాయి నాయకుల వరకు అవినీతి రాజ్యమేలిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలు జరిగాయన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలన పారదర్శకంగా నడుస్తోందని, చెవిరెడ్డి నిరాధార ఆరోపణలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రావిళ్ళ గిరినాయుడు, జయచంద్రానాయుడు, బాదురు కోటేశ్వర్ రెడ్డి, గోపాల్ నాయుడు, అయ్యా చిరంజీవి, జెడి జగన్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులలో అవినీతి జరిగిందంటూ చెవిరెడ్డి దుష్ప్రచారం చేయటాన్ని ఖండిస్తూ మండల పార్టీ అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు చంద్రగిరి మండల పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ తుడా నిధులను దోపిడీ చేసిన అవినీతిపరుడు చెవిరెడ్డికి, ఉపాధి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ బాషా మండల పార్టీ ఉపాధ్యక్షుడు అత్తూరు తులసీశ్వర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సునీల్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారుల జీవిత భద్రతకు కూటమి భరోసా : శాప్ చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి సిటి: క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, కానీ క్రీడల కారణంగా క్రీడాకారుడికి చేకూరే శారీరక, మానసిక స్థైర్యం అసాధారణమని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్లో నిర్వహించిన వార్షిక ఉచిత వేసవి శిక్షణ శిభిరంలో పాల్గొన్న 400 మంది క్రీడాకారులకు శనివారం ఆయన చేతులు మీదుగా క్రీడాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ మాట్లాడుతూ క్రీడాకారులకు జీవిత భద్రత కల్పిస్తూ ప్రభుత్వ కొలువుల్లో రాతపరీక్ష లేకుండా సీఎం చేశారన్నారు. మెగా డీఎస్సీలో రాష్ట్రవ్యాప్తంగా 421 మంది క్రీడాకారులకు ఉద్యోగ భద్రత లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల డీఎస్డీఓలు సయ్యద్ సాహెబ్, బాలాజీ, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ పాల్గొన్నారు.

'వివాహం దివ్యత్వ సాధనం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, చెలికాని అన్నారావు సభాభవనంలో శనివారం రామకృష్ణ సేవా సమాజం పుదిపట్ల, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ తిరుపతి సంయుక్త ఆధ్వర్యంలో వివాహం దివ్యత్వ సాధనం అనే గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రొ. జిఎస్ఆర్ కృష్ణమూర్తి, ఆముదాల మురళి, ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, డాక్టర్ సివి రెడ్డి, సంపాదకత్వం వహించిన గంగవరం శ్రీదేవి, రామకృష్ణ సేవా సమాజం పుధిపట్ల నిర్వాహకులు సుధాకర్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

గైనకాలాజిస్ట్ డాక్టర్ రూప రాజీనామా

ప్రజాశక్తి -కోట : కోట మండలం, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్గా 2 సంవత్సరాలనుండి విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రూప శనివారం ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆమె స్థానంలో అక్కడే చిన్న పిల్లలు డాక్టర్గా పని చేస్తున్న డాక్టర్ పి.డోమ్ ప్రియా రావు బాధ్యతలు చేపడుతున్నట్లు సమాచారం.

డేటా సైన్స్కు మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో డేటా సైన్స్ చదివి ఉద్యోగాల ఇంటర్న్ షిప్కు ఎంపికైన విద్యార్థులను ఎస్వీయూ ఇంచార్జ్ విసి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు అభినందించారు. శనివారం విసి కార్యాలయంలో ఎన్ఏఆర్ఎల్, షార్, ఇస్రో వంటి సంస్థల్లో ప్లేస్మెంట్లను పొందిన విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కొన్ని కొత్త కోర్సులను ఆవిష్కరించారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, ఎక్సాఫ్లూయెన్స్ ఇంక్., (యుఎస్ఏ)తో కలిసి పని చేసే నిపుణులతో విద్యార్థుల ప్రయోజనం కోసం డేటా సైన్స్లో కొత్త కోర్సులను విశ్వవిద్యాలయ అధికారులు ప్రకటించారు. 1.పిజి డిప్లొమా ఇన్ డేటా సైన్స్ – (1 సంవత్సరం వ్యవధి), 2. సర్టిఫికెట్ ఇన్ పైథాన్ ఫర్ ఎఐ, ఎంఎల్, జనరల్ ఎఐ – (6 నెలల వ్యవధి) 3.సర్టిఫికెట్ ఇన్ డేటా విజువలైజేషన్ – (6 నెలల వ్యవధి) 4.సర్టిఫికెట్ ఇన్ క్లౌడ్ టెక్నాలజీస్ –(6 నెలల వ్యవధి) వంటి కోర్సుల బ్రోచర్ ను వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ విడుదల చేశారు.

కళత్తూరు సుబ్బారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం కన్నుమూసిన సూళ్లూరుపేటకు చెందిన కళత్తూరు సుబ్బారెడ్డికి మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం కళత్తూరు శేఖర్ రెడ్డి, కళత్తూరు కిరణ్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నెలవల వెంట టీడీప నాయకులు మధు నాయుడు, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఏజి కిషోర్, మైలారి రాజశేఖర్, టీడీపీ నాయకులు ఉన్నారు.

జాబ్ మేళాలో 212 మంది ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాలిటీ పరిధి, గోవింద పాలెంలోని శ్రీ విద్యా డిగ్రీ, ఎంబీఏ కళాశాలలో శనివారం మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన జాబ్ మేళాలో 30 యంఎన్సి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇంటర్వ్యూలలో 530 మంది పాల్గొనగా 212 మంది ఎన్నికైనట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ జి.ఉమామహేశ్వర్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ చిత్తూరు జిల్లా ప్లేస్మెంట్ ఆఫీసర్ వెంకట ప్రసాద్లు తెలియజేశారు.

వీధి వ్యాపారుల చట్టం అమలు చేయండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బొంతాలమ్మ గుడి వద్ద ఉన్న చిరు వ్యాపారస్తులపై టౌన్ ప్లానింగ్ అధికారులు చేసిన దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తిరుపతి నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాధాకృష్ణ వీధి వర్తక వ్యాపార కార్మిక ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సిహెచ్ శివకుమార్లు వీధి వర్తక వ్యాపార చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు కే వై రాజా, వెంకటేష్ సురేష్, కిషోర్, బాబు, శెట్టిపల్లి రవి, రైల్వే బాల శ్రీనివాసులు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

వేద విశ్వవిద్యాలయంలో వేసవి శిక్షణ

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వైదిక, యోగాలలో అవగాహన కల్పనకు వేసవి శిక్షణ తరగతులు 7వ తేదీ నుండి జూన్ 5 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు పిఆర్ఓ బ్రహ్మాచార్యులు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై శ్రద్ధ చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి

ప్రజాశక్తి - నాయుడుపేట: వేసవిని దృష్టిలో ఉంచుకుని నాయుడుపేట మండలంలోని 19 పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం, తాగునీటి సరఫరాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నాయుడుపేట ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి సూచించారు. శనివారం నాయుడుపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో వ్యవహరించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అధికారులు సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులందరూ సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని కోరా రు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట జడ్పిటిసి సభ్యులు కట్టా జ్యోతి రెడ్డి, ఎంపీడీవో కే.సురేష్ బాబు, పలువురు అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడుల నియంత్రణకు ప్రత్యేక చొరవ చూపాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి, చిత్తూరు జిల్లాల పరిధిలో ఏనుగుల దాడుల నియంత్రణకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా ఏర్పాటైన ఏనుగుల టాస్క్ ఫోర్స్ దాడులను సమర్థవంతమైన ప్రణాళికతో నియంత్రణ చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సమన్వయ లైన్ డిపార్ట్మెంట్లకు సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్లో ఏనుగుల ప్రత్యేక టాస్క్ ఫోర్స్ నిర్వహణకు లైన్ డిపార్ట్మెంట్ లతో పాటుగా చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నానితో వర్చువల్గా కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వర్చువల్ కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్తో పాటు, ఏనుగుల టాస్క్ ఫోర్స్ చైర్మన్, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, తిరుపతి ఆర్డీవో, జిల్లా ప్లానింగ్ అధికారి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ, అటవీ శాఖ ఉప విభాగ అధికారి, చిన్న గొట్టిగల్లు, చంద్రగిరి మండలాల ఎంపీడీవోలు, తహసిల్దార్లు, వారి సహాయక సిబ్బంది, భాకరాపేట, పనబాకం, తిరుపతి యాంటీ కోచింగ్ యూనిట్ ఎఫ్ఆర్వోలు పాల్గొన్నారు. ఏనుగు టాస్క్ ఫోర్స్ ఏర్పాటుతో తిరుపతిలో మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయబడుతుందని, జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, డీఎఫ్ఓ కార్యాలయంలో మూడు కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. చిన్నగొట్టిగల్లు మండలంలో 30 గ్రామాల్లో ఏనుగు, మనుషుల మధ్య సంఘర్షణ వాతావరణం దాని కారణాలు నమోదవుతున్నాయని, ఇటీవల కాలంలో ఏనుగుల గుంపుపై రాళ్లదాడితో అవి తిరగబడి ప్రాణాపాయం కల్పించిన సందర్భం ఏర్పడిందన్నారు. ఇప్పటివరకు రూ.40 లక్షల రూపాయలు నష్టపరిహారం బాధితులకు ఇవ్వవలసి ఉందన్నారు. పొలాలకు విద్యుత్ కంచెలను తొలగించాలని, క్రిందకు ఉండే విద్యుత్ వైర్లనుపైకి ఏర్పాటు చేయాలన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఏనుగుల మందలను సమర్థవంతంగా జనావాసాలకు రాకుండా నియంత్రించడానికి శిక్షణ పొందిన ఎలిఫెంట్ ట్రాకర్లను నియమించుకోవాలన్నారు. పెండింగ్లో ఉన్న పరిహార కేసులన్నీ క్లియర్ చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.

8,9 తేదీల్లో తుడా టవర్స్ వేలం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఈనెల 8,9, తేదీల్లో ఈ–వేలం ద్వారా తుడా టవర్స్ వాణిజ్య గదుల విక్రయాన్ని క్రమపద్ధతిలో నిర్వహించాలని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలోని అన్నమయ్య కూడలి వద్ద నిర్మాణంలో ఉన్న తుడా టవర్స్ను శనివారం ఉదయం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుపతిలోని అన్నమయ్య కూడలి వద్ద 3.60 ఎకరాల స్థలంలో 13 అంతస్తులతో ప్రతిష్టాత్మకంగా "తుడా టవర్స్" నిర్మిస్తున్నామని అన్నారు. ఇందులో నివాసయోగ్యమైన గదులకు ఈ–వేలం నిర్వహించి విక్రయించడం జరిగిందని తెలిపారు. తుడా టవర్స్ గ్రౌండ్ ఫ్లోర్ (10 గదులు), మొదటి అంతస్తు (21 గదులు)లోని వాణిజ్య గదులను మే 8, 9 తేదిలలో ఈ–వేలం ద్వారా విక్రయించనున్నామని అన్నారు. వాణిజ్యపు గదులు 2000 నుండి 9000 చదరపు అడుగుల విస్తీర్ణముతో నగర వాణిజ్య సముదాయములకు అత్యంత అనువైనదిగా నిర్మించామని అన్నారు. వివరాలకు తుడా కార్యాలయము, తుడా టవర్స్ వెబ్సైట్లులో సంప్రదించాలని సూచించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, డి.ఈ. భాషా ఉన్నారు.

గంగజాతరను వైభవంగా నిర్వహిద్దాం .. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని, మే 5 లోపు అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు.

38 మందికి టిడిఆర్ బాండ్లు అందజేత.. నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారిలో అర్హులైన వారికి టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టిడిఆర్ మేళాలో అర్హత పొందిన 38 మందికి శనివారం సాయంత్రం టిడిఆర్ బాండ్లను కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 556 మందికి టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సి ఉండగా 239 మంది అర్హులను గుర్తించి టిడిఆర్ బాండ్ల కమిటీ ఆమోదం తెలిపిందని అన్నారు.

హద్దులు మీరిన భవనాలకు నోటీసులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం గ్రామపంచాయతీ పరిధిలో హద్దులు మీరి నిర్మిస్తున్న భవనాలకు పంచాయతీ కార్యదర్శులు జయశంకర్, లావణ్యలు శనివారం నోటీసులు జారీ చేశారు. ఏప్రిల్ 29న మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ తుడా క్వార్టర్స్ వద్ద అనుమతులు మీరి నిర్మిస్తున్న 5 అంతస్తుల అపార్ట్మెంట్ భవనంపై నుండి పడి ముగ్గురు కార్మికులు చనిపోవడంతో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్షేత్రస్థాయిలో విఫలమైన పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేయడం విదితమే. అప్రమత్తమైన పంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీ పరిధిలో నిర్మాణ దశలో ఉన్న భవనాలను గుర్తించి శనివారం నోటీసులు ఇచ్చారు. సప్తగిరి కాలనీకి సంబంధించి 11, మంగళం పంచాయతీ పరిధిలో 6 నిర్మాణ దశలో ఉన్న భవనాలకు నోటీసులు జారీ చేశారు.

బాయిలర్లో పడి కార్మికుడు మృతి



ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, పాలగుంట, స్ప్రీ కంపెనీలో శనివారం కార్మికుడు ఫారన్(22) బాయిలర్పై వెల్డింగ్ చేస్తూ ప్రమాదవశాత్తు బాయిలర్లో పడి కాలి మృతి చెందాడు. మృతుడు ఉత్తంప్రదేశ్, బేక్ పెట్ జిల్లాకు చెందిన రషీద్ కుమారుడుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. స్ప్రీ కంపెనీకి కాంట్రాక్ట్ పనులలో వెల్డింగ్ పని నిమిత్తం గత కొద్ది రోజులకు ముందు వచ్చాడని, అత్యవసర పని నిమిత్తమై కాలుతున్న బాయిలర్ పైకి ఎక్కి వెల్డింగ్ చేస్తున్న క్రమంలో కాలుజారి బాయిలర్లో పడిపోవడంతో కాలి మృతి చెందినట్లుగా విచారణలో తెలిసిందన్నారు. ఎస్సై రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కంపెనీలో సరైన భద్రత నియమాలు పాటించకపోవడమే కారణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

రూ.50 వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలోని బోడేవాళ్ళపల్లి పంచాయతీ, వడ్డిపల్లికి చెందిన కోటకొండ రమణ అకాల వర్షంతో పిడుగు పడి శుక్రవారం మృతి చెందారు. అతని కుటుంబాన్ని ఆదుకోవడానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో, కలెక్టర్ ఆదేశాల మేరకు తాసిల్దార్ పరమేశ్వర స్వామి, మండల టిడిపి నాయకులు యాభై వేల రూపాయల నగదును మృతుడి భార్యకు అందించారు.

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, శివాలయం సెంటర్ వద్ద సి.ఐ.టి.యు ఆటో కార్మికులు శనివారం ప్రజలకు మజ్జిగ అందజేశారు. అనంతరం తిరుపతి జిల్లా సి.ఐ.టి.యు అధ్యక్షులు బి.వి.రమణయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆటో స్టాండ్ గౌరవాధ్యక్షులుగా ఎస్కే.షఫీ, అధ్యక్షులు ఎస్కే.మౌలా, ఉపాధ్యక్షులు ఎస్కే.సలీం, కార్యదర్శి ఎస్కే.మున్నా, సహాయ కార్యదర్శిగా పి.కళ్యాణ్, ట్రెజరర్గా రోహిణిలను ఎన్నుకున్నారు. ఎస్కే.మోబిన్, తాజుద్దీన్, అక్బర్, పవన్, శ్రీను కమిటీ సభ్యులుగా కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో ఎస్కే.కాలేషా, గిరి, శివారెడ్డి, మున్నా, ప్రసాద్, గోపి పాల్గొన్నారు.

సత్యవేడు ఎంపిడిఓకు పరామర్శ

ప్రజాశక్తి - సత్యవేడు: అనారోగ్యంతో తిరుపతిలో చికిత్స పొందుతున్న సత్యవేడు ఎంపిడిఓ చంద్ర శేఖర్ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరామర్శించారు. సత్యవేడులో విధి నిర్వహణలో ఉండగా ఎంపిడిఓ శుక్రవారంఅస్వస్థతకు గురయ్యారు. సహోద్యోగులు చికిత్సకోసం తిరుపతి ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే అయనను పరామర్శించారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మంచినీటి చలివేంద్రాన్ని శనివారం తహశీల్దార్ మధుసూదన్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిటి జగన్మోహన్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: భూసార పరీక్షలతో మట్టిలో సారాన్ని పరిశీలించి, ఆ భూమికి కావాల్సిన ఎరువులను నిర్ణయిస్తామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి భారతి పేర్కొన్నారు. మండలంలోని 28 పంచాయతీలో ఉన్న రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా శనివారం భూసార పరీక్షలు ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. భూ సారాన్నిబట్టి ఎరువుల వాడకం, మట్టిలో ఉన్న పోషకాలు ఇతర అంశాల గురించి రైతులు తెలుసుకోవాలని భారతి రైతులకు సూచించారు.